ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 14 ఏప్రిల్ 2024





ప్రత్తిపాడు సభకు హాజరైన జన సందోహం



# రాజధాని.. అమరావతే

## ప్రజాగళం.. నూతనోత్తేజం



- ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి
- 30 రోజుల్లో రాష్ట్రంలో మారనున్న చరిత్ర
- జూన్ 4న జగనాసుర వధ.. అమరావతి వేడుక
- మళ్లీ జగన్‌కు ఓటేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లే
- అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం
- తాడికొండ, ప్రత్తిపాడు ప్రజాగళం సభల్లో చంద్రబాబు

తాడికొండ, ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: ప్రపంచంలో తెలుగు వారు గర్వపడేలా రాజధాని అమరావతిని నిర్మిస్తా. అమరావతే ఆంధ్రుల రాజధాని. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే రోజే అమరావతే రాజధాని అని మీరంతా వేడుక జరుపుకునే రోజు. అదేరోజున జగనాసుర వధ.. అమరావతి రక్షణ రెండూ జరుగుతాయి. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లేనన్నారు. మరో 30 రోజుల్లో రాష్ట్రంలో చరిత్ర మారుతుందన్నారు. రాజధాని అంటే ఆత్మ గౌరవం.. ఆత్మవిశ్వాసం.. గర్వంగా చెప్పుకునే ప్రజల ఆస్తి అన్నారు. హైదరాబాద్‌కు ధీటుగా, దేశంలో నెంబర్ వన్‌గా, ప్రపంచంలో గొప్ప నగరాల్లో ఒకటిగా చెప్పుకునే రాజధానిని నిర్మించాలనుకున్నా కానీ మూడు రాజధానులంటూ అమరావతిని జగన్ సర్వనాశం చేశారన్నారు. విట్, అమృత, ఎస్‌ఆర్‌ఎం వంటి ప్రపంచస్థాయి విద్యాసంస్థలతో అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా మార్చాలనుకుంటే జగన్ సర్వనాశనం చేశాడన్నారు. అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం.. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. 3 వేల కేసులు.. అడు గడుగునా అవమానాలు, పోలీసుల హింస, జైల్లో పెట్టి వేధింపులు.. ఎన్ని చేసినా పోరాటం ఆపలేదని, వారి పోరాటంతోనే అమరావతి గెలిచింది.. నిలిచిందన్నారు. రాష్ట్రం బాగుండాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు.



తాడికొండలో వేదికపై ప్రసంగిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్


ప్రత్తిపాడులో కండువాలు ఊపుతూ ఉత్సాహపరుస్తున్న చంద్రబాబు, రామాంజనేయులు, పెమ్మసాని



- తాడికొండ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

- తాడికొండ, ప్రత్తిపాడు పసుపుమయం
- చంద్రబాబు రాకతో పులకించిన జనం

ప్రజల కేరింతలు.. తెలుగు తమ్ముళ్ల జయజయధ్వానాలు.. యువత సందడి.. మహిళల హారుతులు.. పసుపు జెండాల రెపరెపల మధ్య శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో చంద్రబాబు ప్రజాగళం కార్యక్రమం జరిగింది. రోడ్ షో, బహిరంగ సభలకు జనం పోటెత్తారు. చంద్రబాబు పర్యటన మార్గాలు జనాలతో కిటకిటలాడాయి. ప్రజాగళంతో కూటమి పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ప్రజాగళం కార్యక్రమాలకు సమీప మండల గ్రామాల నుంచి భారీగా జనం ఉత్సాహంగా తరలివచ్చారు. చంద్రబాబును చూసిన ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తాడికొండ, ప్రత్తిపాడు ప్రధాన కూడళ్ల పసుపు జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయాయి. హెలికాప్టర్‌లో తాడికొండకు వచ్చిన చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హెలి ప్యాడ్ నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాడికొండలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సభా స్థలి వద్దకు చేరుకుని ప్రసంగించారు. ఈ సభకు రాజధాని పరిధిలోని గ్రామాల నుంచి మహిళలు, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబు కోసం ఎదురు చూశారు. సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు జెండాలతో మద్దతు తెలిపారు. సభ అనంతరం చంద్రబాబు హెలికాప్టర్‌లో ప్రత్తిపాడుకు చేరుకున్నారు. చంద్రబాబు రాకతో ప్రత్తిపాడు పులకించిపోయింది. ఆయన రాక సందర్భంగా ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. ఆయా సభలో చంద్రబాబు తమ్ముళ్లూ అంటూ పలకరించిన తీరు.. నా ఆడబిడ్డలు అంటూ చూపిన ఆప్యాయతతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆయా సభల్లో గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ, ప్రత్తిపాడు అభ్యర్థులు తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మతో అలింగనం



చంద్రన్నకు దిష్టి తీస్తూ..



ప్రత్తిపాడులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు



తాడికొండలో సభలో మహిళల అభివాదం



ప్రత్తిపాడు సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు



ప్రత్తిపాడులో మిద్దెలపైకెక్కిన అభిమానులు



గజమాలతో స్వాగతం

# మిర్చి ధర పతనం

## గుంటూరు యార్డులో సగం తగ్గిన వైనం

- క్వింటా రూ.20 వేల నుంచి రూ.10 వేలకు తగ్గుదల
- కొన్ని రకాలకు ఆశించిన ధర రాక రైతు కంట కన్నీరు
- శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుంటున్న రైతులు



గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర రోజురోజుకు పతనమవుతోంది. సీజన్ ప్రారంభం(జనవరి)లో క్వింటాల్ రూ.20 వేల వరకు ఉన్న మిర్చి ధర నేడు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయింది. ప్రకృతి విపత్తులను తట్టుకుని పంట పండించినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో ఉన్న ధరతో పోల్చి చూస్తే ప్రస్తుతం దాదాపుగా 50 శాతం పతనమైంది. ఏమి చేయాలో దిక్కుతోచని రైతులు రాబోయే రోజులపై ఆశలు పెట్టుకుంటూ తమ వద్ద ఉన్న మిర్చిని శీతలగిడ్డంగుల్లో నిల్వ చేసుకుంటున్నారు. గుంటూరు పరిసరాల్లో ఇప్పటికే కోల్డ్‌స్టోరేజ్‌లు సామర్థ్యం మేరకు నిండిపోయాయి. నేటికీ రోజుకు లక్షన్నర మిర్చి టిక్కీలు వస్తుండటంతో వాటిని నిల్వ చేసే పరిస్థితి లేక మార్కెట్‌లో వచ్చిన ధరకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. విదేశాలకు ఎగుమతులు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు మిర్చిని గుంటూరు మిర్చియార్డుకు తీసుకొస్తుంటారు. అయితే గత ఏడాది శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చి టిక్కీలలో 20 లక్షలు ఈ సంవత్సరం సీజన్ ప్రారంభం నాటికి కూడా రైతులు విక్రయించుకోలేకపోయారు. ఇందుకు కారణం ఆశించిన ధర లేకపోవడమే. ఒకపక్క కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు, మరోవైపు మార్కెట్‌కి కొత్త పంట పోటెత్తడంతో ధర క్రమేపి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌కి రెండు, మూడో కోతల్లో కోసిన మిరపకాయలను రైతులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం సింజెంటా బ్యాడిగి క్వింటాల్ ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే లభిస్తుంది. గత ఏడాది ఈ రకానికి క్వింటాల్ రూ.30 వేలకు పైగా ఇక్కడ ధర లభించింది. విత్తన రకాలైన ఆర్మూరు, నెంబరు 341, క్లాసిక్ వంటివి రూ.8 వేల నుంచి రూ.10 వేల మధ్య ఉన్నాయి. ఎక్స్‌పోర్టు క్వాలిటీ తేజ గత ఏడాది క్వింటాల్ రూ.26 వేల వరకు ఉండగా నేడు రూ.12 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే ఉన్నది. డీలక్స్‌కి మాత్రం రూ.17 వేల నుంచి రూ.19 వేలు ఇస్తున్నారు. తాలుకాయలు రూ.12 వేల వరకు సీజన్ ప్రారంభంలో ఉండగా నేడు రూ.4 వేల నుంచి రూ.7 వేలకు తగ్గిపోయాయి.

### పట్టించుకోని ప్రభుత్వం

మార్కెట్‌లో ధర పతనం అయినప్పుడు మార్క్‌ఫెడ్‌ని రంగంలోకి దింపి రైతుల వద్ద ఉన్న మిర్చిని కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కనీసం ప్రభుత్వ పరంగా మిర్చిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన సదుపాయాలను కూడా కల్పించడంలేదు. గుంటూరు పరిసరాల్లో 85 వరకు ఫంక్షనల్ కోల్డ్‌స్టోరేజ్‌లున్నాయి. ప్రమాణాలు సక్రమంగా పాటించే ఏ కేటిగిరి కోల్డ్‌స్టోరేజ్‌లు 20 రోజుల క్రితమే నిండిపోయాయి. బీ కేటిగిరీ కూడా రెండు రోజుల క్రితం ఫుల్ అయ్యాయి. 10 నుంచి 12 మాత్రమే ఉన్న సీ-కేటిగిరీ కోల్డ్‌స్టోరేజ్‌లలోనూ రైతులు తమ మిరపకాయలను స్టాకు పెట్టడం ప్రారంభించారు. అవి కూడా వారం వ్యవధిలోనే నిండిపోవచ్చని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నాయి. సీజన్ ముగియడానికి ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ధర మరింత తగ్గే అవకాశం లేకపోలేదు.

# నేడు తెనాలికి పవన్‌కల్యాణ్

- వారాహిపై పట్టణంలో రోడ్ షో
- సభలో ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల
- ఏర్పాట్లను పరిశీలించిన మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13: గతంలో వాయిదా పడిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన తాజాగా ఖరారైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారు. ఆయన తెనాలి రావడం ఇదే తొలిసారి కావడంతో పవన్ అభిమానులు, జనసేన శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్ ద్వారా తెనాలి సుల్తానాబాద్‌లోని హెలీప్యాడ్ వద్దకు పవన్ చేరుకుంటారని జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అక్కడి నుంచి వారాహి వాహనంపై పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చెంచుపేట, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదగా మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్లోని పురవేదిక వద్దకు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం జరిగే బహిరంగ సభలో పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ పర్యటన, బహిరంగసభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామని మనోహర్ తెలిపారు. ఈ సభకు గుంటూరు, బాపట్ల, కృష్ణ జిల్లాల నుంచి ఉమ్మడి పార్టీల నాయకులు, శ్రేణులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరవుతారని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పా టు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను శనివారం కూటమి నేతలతో కలిసి మనోహర్ పరిశీలించారు. పవన్ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను ఆయన కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో పవన్‌కల్యాణ్ ప్రజల ముందుంచుతారని తెలిపారు. కార్మికులు, రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి చేపట్టబోయే పరిష్కారాలను కూడా ప్రస్తావిస్తారన్నారు.



సభాప్రాంగణం వద్దకు ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి వస్తున్న మనోహర్

గుంటూరు జంక్షన్ అంటే అంత చిన్నచూపా!
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

టీడీపీలో చేరిన రావి వెంకటరమణ

రాజధానికి భూములిస్తే రోడ్డు పాలు చేశారు
- 1579 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

6 లో..



మంగళగిరి ఇస్లాంపేటలో శనివారం రాత్రి నిర్వహించిన రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్

# మంగళగిరి ప్రజల మనసులు గెలుస్తా

- మార్పు కోసమే వచ్చా.. మంగళగిరి చరిత్ర తిరగ రాస్తా..
- పసుపు జెండా ఎగరేసి అభివృద్ధికి చిరునామాగా మారుస్తా
- ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్


కుంచనపల్లి సమృద్ధి అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న లోకేశ్


లోకేశ్‌కు హారతులిస్తున్న అపార్టుమెంట్ వాసులు

తాడేపల్లి, ఏప్రిల్ 13: మార్పు కోసమే మంగళగిరికి వచ్చా. 1985 తర్వాత ఇక్కడ టీడీపీ గెలవలేదు. ఈసారి పసుపు జెండా ఎగరేసి చరిత్ర సృష్టిస్తా.. మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మార్చి ప్రజల మనసుల్లో స్థానం సంపాదిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ అన్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లి సమృద్ధి అపార్టుమెంట్ వాసులతో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మంగళగిరిలో ఓడిపోయినా, నా సొంతం అనుకుని నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలు అందిస్తున్నానని, సొంత డబ్బుతో 29 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచానన్నారు. శాసనసభ్యునిగా ఎన్నికయ్యాక పేదరికం లేని మంగళగిరిగా తీర్చిదిద్ది మంగళగిరి మోడల్‌ను దేశానికి పరిచయం చేస్తానన్నారు. ప్రజలు కోరకపోయినా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసి పన్నుల భారం పెంచారని మౌలిక సదుపాయాలు విస్మరించారన్నారు. పంచాయతీలుగానే కొనసాగించాలని అనేక గ్రామాల ప్రజలు కోరుతున్నారన్నారు. కార్పొరేషన్ అంశం కోర్టు పరిధిలో ఉందని ప్రజాభీష్టం మేరకు ఈ రెండింటిని మున్సిపాలిటీగా మార్చి పన్నుల భారం తగ్గిస్తానన్నారు. నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజి నిర్మాణంతోపాటు కుళాయి ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తానన్నారు.

**బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్‌తో అభివృద్ధి**

బ్లాక్ డెవలప్‌మెంట్ విధానంలో రోడ్లు, పార్కులు, ఆరోగ్య కేంద్రాలు, ఏర్పాటు చేస్తామని లోకేశ్ చెప్పారు. 25 ఏళ్లుగా రెండు కుటుంబాలను ఆదరించారని, వారు ఒక్క పరిశ్రమ గానీ ఉద్యోగం గానీ తీసుకురాలేక పోయారన్నారు. స్వర్ణకారులు అధికంగా ఉన్నందున మంగళగిరిలో గోల్డ్ సెజ్ ఏర్పాటు చేసి 30 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు ప్రోత్సాహకాలు అందించి నియోజకవర్గానికి అనేక ఐటీ పరిశ్రమలు తీసుకువస్తే జగన్ వచ్చాక అవన్నీ తరలి పోయాయన్నారు. మంగళగిరికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఈ ఎన్నికల్లో 53500 ఓట్ల భారీ మెజారిటీతో నన్ను గెలిపిస్తే చంద్రబాబు, పవన్‌తో దెబ్బలాడి నిధులు తీసుకొస్తానన్నారు.

**సమస్యలు విన్నవించిన అపార్టుమెంటు వాసులు**

సమృద్ధి అపార్టుమెంట్ వాసులు పలు సమస్యలు లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, ఇందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు స్థానికంగా ఉపాధి ఏర్పాటు చేయాలని, అమరావతిలో స్థలాలు కొంటే పట్టాలు ఇవ్వలేదని, యానిమేషన్ రంగాన్ని ప్రోత్సహించాలని, రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. యువనేత లోకేశ్ స్పందిస్తూ మంగళగిరి నియోజకవర్గంలో పసుపు, మిర్చి వంటి స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు లాభసాటి చేస్తామని, సాంప్రదాయ కోర్సులతోపాటు విద్యతోపాటు ఉపాధి కల్పించే ప్రాసెసింగ్ కోర్సులు ప్రవేశపెడతామని, కేజీ నుంచి పీజీ వరకు సిలబస్‌లో మార్పులు తెస్తామని లోకేశ్ చెప్పారు.

# రాజధానికి భూములిస్తే రోడ్డు పాలు చేశారు

- 1579 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు


వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఏప్రిల్13: రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు భూములు ఇస్తే మూడు రాజధానులని తమను రోడ్డు పాలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి పుట్టగతులుండవని రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1579వ రోజుకు చేరున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, రాజధాని అమరావతిని స్వాగతిస్తున్నామని ఎన్నికల ముందు చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట మొదలు పెట్టి అమరావతిని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల అంశాన్ని అమలు చేయాలని అనుకోవటం పెద్ద తప్పిదమన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించాలని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

# కొండవీడుకోటలో బయల్పడిన శాసనం


కొండవీడుకోటలోని పుట్టాలమ్మ చెరువు సమీపంలో రంగ మండపం రాతి స్థంభంపై బయల్పడిన 15వ శతాబ్దం నాటి శాసనం

కొండవీడుకోట(యడ్లపాడు), ఏప్రిల్ 13: పల్నాడుజిల్లా యడ్లపాడు మండలం కొండవీడుకోటలో క్రీశ 15వ శతాబ్దానికి చెందిన శాసనం బయల్పడినట్లు కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు. కొండవీడుకోటలో మండపాలుగా పిలువబడే నాలుగు నిర్మాణాలు ఉన్నాయని, వాటిలో రెండింటిని గుర్రపుశాల, రెడ్డిగారి భోజనశాలలుగా వాడుకలో ఉన్నాయన్నారు. మిగిలిన రెండింటిని మండపాలుగానే గుర్తిస్తున్నారు. పుట్టాలమ్మ చెరువుకు పడమర దిక్కున ఉన్న శిథిల మండపంలోని ఓ రాతి స్తంభంపై పెద్దకోమటి వేమారెడ్డికి చెందిన శాసనం బయల్పడిందన్నారు. దానితో పాటు మండపంలోనే మరో మూడు శాసనాలు కూడా లభ్యమయ్యాయన్నారు.



# టీడీపీలో చేరిన రావి వెంకటరమణ

- భారీగా తన అనుచరవర్గంతో సభకు వచ్చిన రావి


ప్రసంగిస్తున్న రావి వెంకటరమణ,పక్కన చంద్రబాబు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో సుమారు 350మంది పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ గూటికి చేరారు. తొలుత గుంటూరు జాతీయ రహదారి నుంచి రావి వెంకట రమణ భారీర్యాలీతో ప్రత్తిపాడు చేరారు. పార్టీలో చేరిన అనంతరం చంద్రబాబు సమక్షంలో రావి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అధికా రంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ప్రజలకు తాగునీరు కూడా అందించలేని ఈ ప్రభుత్వం ఉన్నట్టా అని ప్రశ్నించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశానని, ఆ పార్టీ వలన ఈ ప్రజలకు ఉపయోగం లేదన్నారు. రేపటి భవిష్యత్తుకు చంద్రబాబు అవసరం అన్నారు. అనంతరం చంద్రబాబు ప్రసంగంలో కూడా రావి వెంకటరమణను కొనియాడారు. 2004లో ఇక్కడ ఎమ్మెల్యేగా చేయడంతో పాటు పొన్నూరు నుంచి పోటీ చేశారని, బాగా కష్టపడి చేసే వ్యక్తికి ఆ పార్టీలో అన్యాయం జరిగిందన్నారు. మంచి వ్యక్తుల్ని మనం వదిలి పెట్టుకోకూడదన్నారు.

**టీడీపీలోకి రావి రాకతో వైసీపీకి భారీ ఝలక్..**

తెలుగుదేశం పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ రావడం వైసీపీకి భారీ నష్టమే కలిగింది. 2004 నుంచి 2009 వరకు ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఉన్న రావి వెంకటరమణకు ఇప్పటికీ నియోజకవర్గంలో గట్టి పట్టే ఉంది. ఎస్సీ రిజర్వేషన్ తరువాత ఇక్కడ మేకతోటి సుచరిత ప్రాతినిధ్యం వహించినా నేటికి నియోజకవర్గంలో ఆయన స్థానం పదిలంగానే ఉంది. నియోజకవర్గంలోని వైసీపీ క్యాడర్ నాయకులకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటున్న ఆయన వెంట నడిచేందుకు పెద్దఎత్తున పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న జగన్ సామాజికవర్గానికి చెందిన కొత్త మల్లాయపాలెం గ్రామం నుంచి కూడా మాజీ సర్పంచ్ వణుకూరి వీరారెడ్డి సైతం రావితో అడుగులు వేశారు. అంతేకాకుండా పాత మల్లాయపాలెం నుంచి కూడా ఆయనకు ఆదరణ లభిస్తుంది. నిమ్మగడ్డవారిపాలెం సర్పంచ్ భర్త గోరిజవోలు సతీష్, పెదనందిపాడు మండల మాజీ వైస్ కన్వీనర్ మదమంచి వాసు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కమ్మా శివప్రసాద్, ఏబీపాలెం సర్పంచ్ రావిపాటి కృష్ణప్రసాద్, ముప్పాళ్ల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ గుంటుపల్లి రవిబాబు, రాజుపాలెం సర్పంచ్ కమ్మా నాగమల్లేశ్వరరావు, కుర్రా శివనాగేశ్వరరావులతో పాటు పొన్నూరు, గుంటూరు నియోజకవర్గాలకు చెందిన సుమారు 350మంది రావితో టీడీపీలోకి వచ్చారు. వైసీపీలో సీనియర్ నాయకులు టీడీపీ గూటికి చేరడంతో వైసీపీకి గట్టి ఝలక్ తగిలింది.

# ఎమ్మెల్యే కోన ప్రచారంలో వలంటీర్


కోన రఘుపతి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ ఊటుకూరి పావని

బాపట్లరూరల్, ఏప్రిల్ 13: ఎలక్షన్ కమీషన్ ఆదేశాలను లెక్క చేయకుండా వలంటీర్లు వైసీపీ నాయకుల ప్రచారంలో పాల్గొంటూనే ఉంటున్నారు. శనివారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించగా ప్రచారంలో ఆగ్రామానికి చెందిన ఊటుకూరి పావని అనే వలంటీర్ పాల్గొన్నారు. వలంటీర్లు ప్రచారంలో పాల్గొనటం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు.

## కాచిగూడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 13: కాచిగూడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో ఆగిన సందర్భంగా రైల్వే ఎస్‌ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. డిఫెన్స్‌కు చెందిన సుమారు రూ.75వేల విలువైన 31 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వీటిని కలిగివున్న ప్రకాశం జిల్లా, గిద్దలూరు తాలూకా, రామాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

# పసుపు రైతులను ఆదుకోవాలి

- చంద్రబాబుకు రైతుల వినతి

రేపల్లె, ఏప్రిల్ 13: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా పసుపు రైతులు తీవ్రంగా నష్టపోయామని రైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నష్టపోయిన పసుపు రైతులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం జనవరి 19తేదీన దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులు నిల్వ చేసుకున్న సుమారు లక్షా నాలుగు వేల పసుపు బస్తాలు కాలిపోయాయని వీటి మార్కెట్ విలువ రూ.115కోట్లు ఉంటుందని తెలిపారు. కోల్డ్‌స్టోరేజీ యజమాని కేవలం రూ.40కోట్లకు మాత్రమే ఇన్సూరెన్స్ చేశారని, ఒక్కో రైతుకు కేవలం క్వింటాకు రూ.5వేలు వస్తుందని తెలుపుతున్నారని దీని కారణంగా ఒక్కో క్వింటాకు రూ.10వేలు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు కోల్డ్‌స్టోరేజీ యజమాని ఇన్సూరెన్స్ సిబ్బంది ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని నష్టపోయిన రైతులకు అన్ని విధాలా ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్వింటాకు రూ.10వేలు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య రైతులు వైవీ సుబ్బారావు, పీవీ రాఘవరావు, సాంబశివరావు, వి.రఘురామ్, వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ, ఎస్పీ సార్ నాపై ఏఏ కేసులున్నాయ్..!

- వివరాలివ్వండి.. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి లేఖ


జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఏప్రిల్ 13: నామినేషన్లు దాఖలు చేసే సమయం దగ్గరపడుతుండడంతో మాచర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అప్రమత్తమయ్యారు. ఈనెల 7న సత్తెనపల్లికి వచ్చిన మాజీ సీఎం చంద్రబాబు బ్రహ్మారెడ్డికి ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినుంచి నీ మీద పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి సమాచారాన్ని తెప్పించుకోవాలని ఆదేశించారు. చంద్రబాబు సూచనల మేరకు ఇన్‌చార్జి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ గరికపాటి బిందుమాధవ్‌కు రాతపూర్వకంగా వినతిపత్రం ఇచ్చి వివరాలను కోరినట్లు సమాచారం. కొన్ని కేసులు వివరాల్వికుండా రహస్యంగా ఉంచి పాలకపక్షం కుట్రలు చేసే అవకాశం వున్నందున బ్రహ్మారెడ్డి అప్రమత్తమయ్యారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ఆరంభం కానున్న దృష్ట్యా నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేసుల వివరాలు తప్పనిసరిగా ప్రమాణపత్రంలో పొందుపరచాల్సి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నామినేషన్‌ను పక్కనపెట్టే అవకాశం ఉంది. బ్రహ్మారెడ్డిని మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా 2021 డిసెంబరు 22 రాత్రి చంద్రబాబు ప్రకటించగా ఆ తరువాత భారీ ఊరేగింపుగా పేటసన్నెగండ్ల ఆలయంలో పూజ చేసి మాచర్లకు చేరుకునే క్రమంలో కేసులు నమోదయ్యాయి. అలాగే 2022 డిసెంబరు 16న మాచర్లలో పార్టీ కార్యాలయాన్ని ప్రత్యర్థి పార్టీ వారు దగ్ధం చేసి దాడులు చేసి బ్రహ్మారెడ్డిపైనే కేసు నమోదు చేశారు. ఇంకా 2003 ఆగస్టు 28న గొట్టిపాళ్ల ఘర్షణకు సంబంధించి బ్రహ్మారెడ్డిపై కేసు నమోదు చేశారు. (అప్పుడు బ్రహ్మారెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో వున్నారు). అదే సంవత్సరం డిసెంబరులో బ్రహ్మారెడ్డి కాన్వాయ్ మాచర్ల సమీపంలో ఓ వ్యక్తికి తగలడంతో ఎస్సీ, ఎస్టీ అత్యాచారక నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఈ క్రమంలో ఒక వేళ అక్రమ కేసుల వివరాలు అందని పక్షంలో ఆర్‌టీఐ(రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్) కింద సమాచారం కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. కాగా ఈనెల 16 లోపు కేసుల వివరాలివ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

# వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం


చిలకలూరిపేటకు సమీపంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న రూరల్ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

తాడికొండ, చిలకలూరిపేట, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడికొండ అడ్డరోడ్డులో పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. శనివారం వాహనాలను తనిఖీలు చేస్తున్న సమయంలో గోరంట్ల గ్రామానికి చెందిన దాడి శివబాబు వద్ద రూ.1.76లక్షలు పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవటంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకొని స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ టీజీ బొల్లారెడ్డికి అప్పగించారు.

**చిలకలూరిపేట వద్ద...**

చిలకలూరిపేట-పెదనందిపాడు మార్గంలో శనివారం వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో కారులో వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద రూ.9.30లక్షల నగదును గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ జి.రవికృష్ణ, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ మిట్టపాలెం గ్రామ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదనందిపాడు మండలం అన్నవరానికి చెందిన నల్లపనేని సుబ్బారావు ఈ నగదును ఒక ప్లాస్టిక్ సంచిలో పెట్టుకొని తీసుకువెళ్తున్నట్టు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు గాని, బిల్లులుగాని అతడు చూపలేదు. దీంతో నగదును వారు స్వాధీనం చేసుకున్నారు.

- దాచేపల్లి: పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఓ మిర్చివ్యాపారి నుంచి రూ.2.23 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు దాచేపల్లి ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని తెక్కళ్లపాడు గ్రామానికి చెందిన పలుసులేటి అంకమ్మరావు మిరియాలగూడెంలోని మిర్చియార్డులో మిర్చి అమ్ముకొని నగదుతో తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించగా ఎన్నికల కోడ్ మేరకు అతని వద్ద పరిమితికి మించి నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# మెప్మా ఎండీ.. సీఎం బంధువు

- ఆరున్నర ఏళ్లు గా అక్కడే వున్నారు
- డ్వాక్రా సంఘాలకు వైసీపీకి ఓటేయమని చెబుతున్నారు
- ఎన్నికల కమిషన్‌కు న్యాయవాది బాబు ప్రకాష్ ఫిర్యాదు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 13: మెప్మా ఎండీ విజయలక్ష్మిని వెంటనే విధుల్లో నుంచి తప్పించాలని ప్రముఖ న్యాయవాది కర్లపూడి బాబుప్రకాష్ మెయిల్ పంపారు. గత ఆరున్నర ఏళ్లుగా ఆమె అదే పదవిలో కొనసాగుతున్నారని అందులో పేర్కొన్నారు. సీఎం జగన్ బంధువు కావటంతో తగిన అర్హత లేనప్పటికీ ఆమెకు ఎండీ పదవిని కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉండి విజయలక్ష్మి ఓటర్లను ప్రభావితం చేసేలా పావులు కదుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేలాది డ్వాక్రా సంఘాలను ప్రభావితం చేసి అధికార వైసీపీ లబ్ధి చేకూర్చాలని విజయలక్ష్మి ప్రయత్నం చేస్తున్నట్లు న్యాయవాది బాబుప్రకాష్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమెను ఆ పదవి నుంచిఇ తప్పించాలని కోరారు.

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మహేందర్ మృతదేహం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 13: పరీక్షల్లో ఫెయిల్ అవడంతో ఇంటర్ విద్యార్థి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం కంభంపాడులో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇర్ల మహేందర్ (17) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివాడు. శుక్రవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో సబ్జెక్ట్‌లు ఫెయిలవడంతో మనస్తాపం చెందాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# 91 మంది వలంటీర్లు రాజీనామా

కొల్లూరు, ఏప్రిల్ 13: కొల్లూరు మండలంలో 91మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ రాజీనామాలు చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లూరు మూడు సచివాలయాల పరిధిలో 32మంది, జువ్వలపాలెంలో 12మంది, క్రాపలో 10మంది, చినపులివర్రు 7, దోనేపూడి 19, వీరుకాక మరో 10మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు సమర్పించారు. మరి కొంతమంది చేత కూడా రాజీనామాలు చేయించే పనిలో వైసీపీ నాయకులు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లుగా మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# గుంటూరు జంక్షన్ అంటే అంత చిన్నచూపా!

- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ హెడ్‌క్వార్టర్స్ అయిన గుంటూరు రైల్వేజంక్షన్ విషయంలో రైల్వే శాఖ చిన్నచూపు చూస్తోంది. తాజాగా 14 ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటు చేసిన ఈస్టు కోస్టు రైల్వే శాఖ వాటిని గుంటూరు మీదగా నడుపుతూ ఇక్కడ నిలుపుదల సౌకర్యాన్ని కల్పించలేదు. దీనిపై జెడ్‌ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెంబరు. 02811 భువనేశ్వర్ - యల్హాంక జంక్షన్ రైలు ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18, 25 తేదీలలో, నెంబరు. 02812 యల్హాంక - భువనేశ్వర్ రైలు ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20, 27 తేదీల్లో నడుపుతామని ఈస్టు కోస్టు రైల్వే నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే ఈ రైళ్లు విజయవాడ తర్వాత నంద్యాలలోనే నిలుపుదల కల్పించారు. గుంటూరు డివిజన్‌లో ఎక్కువగా డిమాండ్ ఉండే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో నిలుపుదల సౌకర్యం కల్పించకపోవడం ఏమిటని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు రైల్వే శాఖని ప్రశ్నిస్తూ లేఖ పంపారు. అలానే నెంబరు. 02863/02864 హౌరా - యశ్వంత్‌పూర్ - హౌరా వీక్లీ ప్రత్యేక రైలు సర్వీసులను కూడా పొడిగించారు. వీటికి కూడా నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో నిలుపుదల కల్పించాలని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పులూరి శశిధర్‌చౌదరి రైల్వేకు లేఖ రాశారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.96
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 142, 151,162 |
| చికెన్ విత్ స్కిన్ | 274.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 284.00 |

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మాట్లాడుతున్న వనమా నరేంద్ర, పాల్గొన్న ఈరంటి వరప్రసాదు తదితరులు

## నేడు ఆర్య, వైశ్య ఆత్మీయ సమ్మేళనం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13: స్థానిక రింగురోడ్డు, సిద్ధార్థ గార్డెన్స్‌లో ఆదివారం ఆర్య, వైశ్య ఆత్మీయ సమ్మేళనం-ఎన్డీఏ కూటమి జిల్లా అభ్యర్థి పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన కమిటీ సభ్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర తెలిపారు. శనివారం, లక్ష్మీపురంలో కోవెలమూడి రవీంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్డీఏ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు హాజరవుతున్నట్టు వివరించారు. టీడీపీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాదు మాట్లాడుతూ అభ్యర్థుల పరిచయంతో పాటు, ఆర్య, వైశ్య సమస్యలను అభ్యర్థుల దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు కొత్తూరు వెంకట్, వాలివేటి కృష్ణ, ఏల్చూరి వెంకటేశ్వర్లు, ఆల్లం శేకర్, కొట శేషగిరి, అల్లం సత్యనారాయణ, అన్నవరపు చక్రి. సురేష్, కాశీ, వెచ్చా కృష్ణమూర్తి పాల్గొన్నారు.



## ప్రజలకు అండగా సూపర్ సిక్స్ పథకాలు

● పెమ్మసాని, నసీర్



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న పెమ్మసాని, నసీర్

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జగన్ అరాచక పాలనను అరికట్టి, ప్రజలకు టీడీపీ జెండా అండగా ఉంటుందని, అందుకు నిదర్శనంగా సూపర్ సిక్స్ భరోసా ఇస్తుందని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 55వ డివిజన్లో అసెంబ్లీ అభ్యర్థి మహమ్మద్ నసీర్‌తో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చర్మకారులు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలను పెమ్మసాని కలుసుకున్నారు. వృత్తి పరమైన, స్థానిక సమస్యలతో పాటు అధికార పార్టీ స్థానిక నాయకుల నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పట్టాలు, తాగునీటి సమస్యలు, పెరిగిన కరెంటు చార్జీలు తదితర సమస్యలను ప్రజలు పెమ్మసాని ముందు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ కేవలం రెండునెలల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### నక్కా ఆనంద్‌బాబును కలిసిన పెమ్మసాని

మాజీమంత్రి నక్కా ఆనందబాబును గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయానికి వెళ్లి శనివారం పెమ్మసాని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సమస్యలపై, గతంలో టీడీపీ తీసుకున్న అభివృద్ధి నిర్ణయాలపై ఇరువురు మాట్లాడుకున్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో అనతి కాలంలోనే పెమ్మసాని ప్రజల్లోకి దూసుకు వెళ్ళారని, అండగా ఉంటామని భరోసా ఇవ్వగలిగిన నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని ఈ సందర్భంగా ఆనంద్ బాబు అన్నారు.



నక్కా ఆనందబాబుతో పెమ్మసాని, టీడీపీ నేతలు

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 13: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ టి.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిపాలెం, శారదాకాలనీ, ఆదిత్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, శివనాగరాజుకాలనీ, హిమనీనగర్, బాలాజీనగర్, మల్లికార్జునపురం, విజయ డిజిటల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## నూతన భవన సముదాయానికి రూ.5 లక్షల విరాళం



చుక్కపల్లి రమేష్‌కు చెక్కును అందజేస్తున్న ప్రొఫెసర్ మువ్వా విజయలక్ష్మి

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 13 : స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న బాలికల వసతి గృహానికి ప్రొఫెసర్ మువ్వా విజయలక్ష్మి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. కుందులరోడ్డులోని బాలికల వసతి గృహంలో శనివారం సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మువ్వా విజయలక్ష్మి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు మువ్వా రామచంద్రయ్య, నాగేంద్రమ్మల జ్ఞాపకార్థంగా ఈ విరాళాన్ని అందజేసినట్టు వివరించారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ గతంలో మువ్వా విజయలక్ష్మి నూతన భవనానికి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారని, మరోసారి రూ.5 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి మర్రిపూడి సీతారామయ్య, పాలకవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, కట్టా శివాజీ, మువ్వా విజయలక్ష్మీ కుమార్తె గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరం

● గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు మెట్లు/ఫుట్‌బోర్డుపై ప్రయాణించడం ప్రమాదకరమని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. రైల్వే చట్టం సెక్షన్ 156 ప్రకారం రైలు పైకప్పు, మెట్లు, ఇంజిన్‌పై ప్రయాణించడం శిక్షార్హం కిందకు వస్తుందన్నారు. మూడు నెలల జైలు/రూ. 500 జరిమాన/రెండు కలిపి శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జనరల్ బోగీలలో ప్రయాణించే ప్రయాణికులు యూటీఎస్ యాప్‌ని వినియోగించి టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడాన్ని అలవాటు చేసుకోవాలని రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాచర్ల రైల్వేస్టేషన్‌లో నడికుడి కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ యాదీద్య, సిబ్బందితో కలిసి ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా టిక్కెట్ పొందవచ్చన్నారు.

## ఉపాధి కల్పన నేటి ప్రజల తక్షణ అవసరాలు

గుంటూరు, ఏప్రిల్ 13: దేశంలో ఉద్యోగం, ఉపాధి కల్పన, ధరల నియంత్రణ నేటి ప్రజల తక్షణ అవసరాలుగా ఉన్నాయని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్స్ అధ్యక్షుడు ఎల్.మురళీకృష్ణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎస్ డీఎస్-లోక్ నీతి అనే ప్రతిష్టాత్మక సంస్థ నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారిలో మూడింట, రెండొంతుల మంది తమ జీవన అవసరాలకే తొలి ప్రాధాన్యతను ఇవ్వటం ప్రజాకాంక్షకు అద్దం పడుతుందన్నారు. తాము ఉద్యోగం, ఉపాధి పొందటం, నిలుపుకోవటం ఈ ఐదేళ్ళ కాలంలో అత్యంత కష్టంగా మారిందని 60 శాతానికి పైగానే జనం ఆవేదన వ్యక్తం చేయటం నిరుద్యోగ తీవ్రతను చెప్పకనే చెబుతోందన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రాంబాబు, సింగరయ్య, సదాశివం, మల్లేశ్వరరావు తదితరులున్నారు.





ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గల్లా మాధవి, శ్రీరత్న తదితరులు

## టీడీపీతోనే మహిళా సాధికారత

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళాశక్తికి ఆద్యుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాసరి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన 'పశ్చిమ' మహిళల ఆత్మీయ సమావేశంలో గల్లా మాధవి, పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్న, నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు. సమావేశంలో మాధవి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అనగానే ఐటీ, అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ సంస్కరణలే కాదు.. సమాజంలో మహిళలు శక్తివంతులుగా ఎదగడానికి ఆయన చేసిన కృషి కూడా ప్రముఖంగా వినిపిస్తుందన్నారు. మహిళా శక్తిని మహాశక్తిగా మార్చాలని చంద్రబాబు మహాశక్తి కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. శ్రీరత్న మాట్లాడుతూ మహిళలను శక్తివంతులుగా చేయడానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. సమాజంలో మగవారితో సమానంగా మహిళలు ఎదగడానికి మహిళా కండక్టర్ల నియామకం, రైతు బజార్ల నిర్వహణ, జనరిక్ షాపులు, ఇసుక ర్యాంపుల నిర్వహణ బాధ్యతలు మహిళలకే అప్పగించారని ఆమె చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలో మహిళల కోసం పొందుపర్చిన ప్రతి అంశాన్ని చంద్రబాబు అమలు చేస్తారు.

### గల్లా మాధవికి బిషప్ దీవెనలు

గుంటూరు పశ్చిమ కూటమి అభ్యర్థి గల్లా మాధవి బిషప్ చిన్నబత్తిని భాగ్యయ్య దీవెనలు పొందారు. గుంటూరు అయన బంగ్లాలో శనివారం ఆమె దీవెనలు అందుకున్నారు. సమర్థవంతులైన నాయకులు విజయ సింహాసనం అలంకరించాలని, ఆ భగవంతుని వేడుకున్నానని బిషప్ ఈ సందర్భంగా తెలిపారు. గల్లా మాధవి మాట్లాడుతూ ఎన్నికల వేళలో బిషప్ దీవెన తనలో నూతన ఉత్సాహాన్ని రెట్టింపు చేసిందని, క్రైస్తవులకు ఎల్లపుడు అండగా నిలుస్తానని ఆమె భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

# ‘మనూ’లో కోర్సులు

## దిక్సూచి

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

• **వెబ్‌సైట్:** www.manuu.edu.in

### ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా...

**పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు:** ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా.

**పీజీ ప్రోగ్రామ్‌లు:** ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం)

**డిగ్రీ ప్రోగ్రామ్‌లు:** బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ.

**ప్రొఫెషనల్ డిప్లొమాలు:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20

### అకడమిక్ మెరిట్ ద్వారా...

**పీజీ ప్రోగ్రామ్‌లు:** ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)

ఇవి కాకుండా ఫుల్‌టైమ్ పార్ట్ టైమ్ కోర్సులు మరికొన్ని కూడా ఉన్నాయి.

**పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు:** హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు అందిస్తోంది.

(ఇవి కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని క్యాంపస్‌ల్లో ఉన్న కోర్సులు - అర్హతలు తదితరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.)

**‘దిక్సూచి’ వెబ్ పేజీలో..**
**సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZmApBfvలో చదవండి.**



## చిత్ర పరిశ్రమకు, అభిమానులకు అంకితం

- రామ్‌చరణ్




హీరో రామ్‌చరణ్ ‘గౌరవ డాక్టరేట్’ అందుకున్నారు. సినీ, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలకు గాను చెన్నైలోని ప్రముఖ ‘వేల్స్ యూనివర్శిటీ’ ఆయనకు శనివారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, యూనివర్శిటీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ ఐసరి గణేశ్ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ... ‘నా పై ఇంత అభిమానంతో గౌరవ డాక్టరేట్ బహూకరించిన వేల్స్ వర్శిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు. 38 ఏళ్లుగా నడుస్తున్న యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వస్తోందంటే ముందు మా అమ్మే నమ్మలేదు. ఆర్మీలాంటి గ్రాడ్యుయేషన్స్ మధ్య నేను ఇలా ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నా తల్లిదండ్రులకు, అభిమానులకు, దర్శకులకు, నిర్మాతలకు, తోటి నటీనటులకు అంకితమిస్తున్నా.’ అన్నారు. తాను చెన్నైలోని విజయా హాస్పిటల్లోనే జన్మించానని, పద్మశేషాద్రి స్కూల్లో చదివానన్నారు. ఈ ప్రాంతం తనకెంతో ఇచ్చిందన్నారు. తన తండ్రి చిరంజీవి జీవన ప్రయాణం కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారన్నారు. తన సతీమణి ఉపాసన కుటుంబం అపోలో హాస్పిటల్స్‌ను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించిందన్నారు. 80 శాతం తెలుగు సినిమాలు ఇక్కడే రూపొందేవని, తెలుగు సినీ పరిశ్రమకు ఇది పుట్టిల్లులాంటిదన్నారు. ఏదైనా సాధించాలని కలలు కని, చెన్నైకి వస్తే అది తప్పకుండా నెరవేరుతుందని వ్యాఖ్యానించారు. అది ఈ ప్రాంతం గొప్పతనమన్నారు. అన్ని రంగాల వారికి ఈ భూమి కలలు నెరవేర్చేదన్నారు. తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తను నటిస్తున్న గేమ్ చేంజర్ మూవీ సెప్టెంబర్-అక్టోబరు నెలల్లో విడుదలయ్యే అవకాశముందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

**ఆంధ్రజ్యోతి, చెన్నై.**

## జీరో బడ్జెట్‌తో శరపంజరం



గంగిరెద్దుల అబ్బాయితో జోగిని ప్రేమలో పడితే ఎటువంటి పరిణామాలు సంభవించాయన్న ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న ‘శరపంజరం’ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. నవీన్‌కుమార్ గట్టు, లయ జంటగా నటించారు.ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నవీన్‌కుమార్ మాట్లాడుతూ ‘ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాను. ఎంతో మంది మిత్రులు నాకు అండగా నిలిచారు. జీరో బడ్జెట్‌తో కేవలం స్నేహితుల సహకారంతో ప్రారంభించిన ఈ యజ్ఞం పూర్తి చేసి విడుదల వరకూ వచ్చాం. గణపతిరెడ్డి మాకు ఎంతో సహకరించారు.’ అని చెప్పారు. సంగీత దర్శకుడు మల్లిక్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందనీ, ఆకలితో ఉన్న వాడికి అన్నం పెడితే జీవితాంతం గుర్తుంచుకుంటాడని, ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలనీ గణపతిరెడ్డి అన్నారు.

## వినోదం పంచే కొంచెం హట్కే



గురుచరణ్, కృష్ణ మంజూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కొంచెం హట్కే’. అవినాశ్ కుమార్ దర్శకత్వంలో అభిమాన థియేటర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ‘ఇందులో హీరో హీరోయిన్స్లు ఉండరు. పాత్రలే ఉంటాయి. సినిమా వినోదాత్మకంగా ఉంటుంది’ అన్నారు. కొంతమంది కలసి సినిమా తీయడానికి చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయని గురుచరణ్ తెలిపారు.

## గొప్ప కంటెంట్‌తో టెనెంట్

సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘టెనెంట్’. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించారు. ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నటుడు ప్రియదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యం రాజేశ్ మాట్లాడుతూ ‘డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. ఇందులో గొప్ప కంటెంట్ ఉంది. ప్రేక్షకులు ప్రతి క్షణం ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది’ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ‘మహిళలకు కనెక్ట్ అయ్యే



కథ ఇది. మా నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే చిత్రమవుతుంద’న్నారు. నిర్మాత మాట్లాడుతూ ‘బలగం, కాంతార’ లాంటి సహజత్వం ఉన్న కథతో తెరకెక్కిన సినిమా ‘టెనెంట్’. ఈ చిత్రంలో భావోద్వేగాలు అద్భుతంగా పండాయి’ అని చెప్పారు.

## మేకప్ మాన్‌కు క్లాప్



దివంగత నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘మేకప్ మ్యాన్’. దివాకర్ యడ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కుమార్ మెట్టుపల్లి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టగా, లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ప్రతి చిత్రానికి కీలకమైన మేకప్ మ్యాన్‌ల పాత్రను, వారి జీవితాన్ని ఇందులో చూపించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో కట్టా రంజిత్, ఆనంద్ భారతి, చిట్టిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి డిఓపి, ఎడిటర్: వాసు వర్మ, సంగీతం: ఎం ఎం శ్రీలేఖ.

**నవ్య ‘దృశ్యం’లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zvr6wiU లో చదవండి.**

## సుగాలీకాలనీలో టీడీపీ ఎన్నికల ప్రచారం



సుగాలీకాలనీలో సూపర్-6 పథకాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు

దుగ్గిరాల, ఏప్రిల్ 13: దుగ్గిరాలలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో బాబు సూపర్-6 పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, చిరువ్యాపారులు సైతం ఆర్థికాభివృద్ధిని సాధించే విధంగా బాబు విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. గుంటూరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖరరావు, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ తిరుగుతూ చేస్తున్న టీడీపీ ప్రచారానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు పేర్కొన్నారు. గద్దె శ్రీనివాస్, శంకర్‌నాయక్, వరదరాజులు, బాలా జీనాయక్, శివశంకర్, గార్లపాటి చిన్నా, సుగాలీలు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎంలో రీసెర్చ్ స్కాలర్ల సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం రీసెర్చ్ స్కాలర్ల సమ్మేళనం జరిగింది. ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు. వివిధ యూనివర్సిటీల నుంచి 150 మందికి పైగా పరిశోధక విద్యార్థులు హాజరై తమ అనుభవాలు, పరిశోధనా వివరాలను పంచుకున్నారు. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ పరిశోధనల అభివృద్ధికి ఎస్ఆర్ఎం చేస్తున్న కృషిని అభినందించారు. రీసెర్చ్ స్కాలర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ బాబ్జీ, విజయవాడ ప్లానింగ్ స్కూల్ డైరెక్టర్ శ్రీకొండ రమేష్, ఎస్ఆర్ఎం ఉపకులపతి మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డీన్ రంజిత్ థాపా, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల్లో ఎన్నారై కళాశాల విజయఢంకా



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎన్నారై డీన్ ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 : ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎన్నారై జూనియర్ కళాశాల విజయఢంకా మోగించింది. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 465 మార్కులు ఐదుగురు విద్యార్థులు సాధించారని డీన్ ఉమామహేశ్వరరావు తెలిపారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను 7 విద్యార్థులు 434 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో తమ విద్యార్థులు 989, 988, 987, 986 మార్కులు సాధించి ముందంజలో ఉన్నారని చెప్పారు. సీనియర్ బైపీసీలో 973, 971, 970 మార్కులు సాధించారు. సీనియర్ ఎంఈసీలో కూడా సత్తా చాటారని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ శివన్నారాయణ, కృష్ణారెడ్డి, మల్లేశ్వరి, సురేష్‌లు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడికొండూరు: ఏప్రిల్ 13: మేడికొండూరు మండలం భీమినేనివారిపాలెం సమీపంలోని వైసీఆర్ కోల్డ్ స్టోరేజ్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సిరిపురం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ హరికృష్ణ (35) భీమినేనివారిపాలెం గ్రామం నుంచి మేడికొండూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పాడి గేదెలను మేపుకొని జీవనం సాగిస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు. వేసవి కాలం కావడంతో మేత కోసం పొలానికి గేదెలను విడిచిపెట్టాడు. సాయంత్రానికి అవి ఇంటికి తిరిగి వస్తాయి. అయితే శనివారం చీకటి పడినా గేదెలు ఇంటికి రాకపోవడంతో వాటిని వెతుక్కుంటూ బయలుదేరిన హరికృష్ణను మృత్యువు కబళించింది. విషయం తెలుసుకున్న మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పశ్చిమడెల్టాకు 916 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 13: కృష్ణా పశ్చిమడెల్టాకు 916 క్యూసెక్కులనీటిని శనివారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద 5.5 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివి జన్ నుంచి రేపల్లెకాల్వ 170, కొమ్మమూరు కాల్వ 397 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 100, తూర్పు కాల్వకు 50, పశ్చిమ కాల్వకు 52 విడుదల చేస్తున్నారు.



# అసమర్థ పాలకుడు జగన్

● గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు, పక్కన ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: సీఎం జగన్మోహన్‌రెడ్డి అసమర్థ పాలకుడని గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం తాడికొండలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఏపీ అంటే జగన్ దృష్టిలో ఏ అంటే ఆపడం.. పీ అంటే పడగొట్టడం అని అన్నారు. జగన్‌కు పడగొట్టడం తప్ప మరేం తెలియదన్నారు. చంద్రబాబునాయుడుకు ఏపీ అంటే ఏ అంటే అభివృద్ధి.. పీ అంటే పోలవరం అని అన్నారు. అమరావతి నిర్మాణం కోసం 34 వేల ఎకరాలను సేకరించిన ఘనత చంద్రబాబుదన్నారు. సీఎం జగన్‌కు నాలుగైదు వేల ఎకరాలను సేకరించే సత్తా ఉందా అని ప్రశ్నించారు. అమరావతిని ఒక వర్గంకు అంటగట్టి.. కక్షగట్టి అన్ని రద్దు చేశాడన్నారు. ప్రజావేదికను కూల్చిన దుర్మార్గుడు జగన్ అన్నారు. వేల మంది కార్మికుల పొట్టకొట్టాడన్నారు. రైతు కూలీలకు అన్యాయం చేశాడన్నారు. రాజధానిని అభివృద్ధి చేసి ఉంటే లక్షలాది మందికి ఉపాధి లభించేదన్నారు. పోలవరం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. టీడీపీ హయంలో 71 శాతం పోలవరం పనులు జరిగాయని తెలిపారు. ఈ ఐదేళ్లలో 4 శాతం పనులు చేయలేదన్నారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిపోయిందని.. కనీసం అది కూడా జగన్ తీసుకురాలేకపోయాడన్నారు. ముఖ్యమంత్రి అంటే కూర్చుని బటన్ నొక్కే వాడు కాదు.. రాబోయే తరాల అవసరాలు గ్రహించి వారి అవసరాలు తీర్చే వాడు ముఖ్యమంత్రి పెమ్మసాని అన్నారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి చేసేవారు కావాలో.. నిరంకుశ పాలన కావాలో ఆలోచించు కోవాలన్నారు.

### టీడీపీ ఇచ్చిన వరం అమరావతి : తెనాలిశ్రావణ్‌కుమార్

రాష్ట్రానికి తెలుగుదేశం పార్టీ ఇచ్చిన వరం రాజధాని అమరావతి అని తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. 1978 నుంచి తాడికొండ నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ ఉన్నదని.. కానీ జగన్మోహన్ రెడ్డి అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మూడు రాజధానులు ప్రకటించిన తరువాత రాజధాని రైతులు, మహిళలు ఆందోళనలు చేశారన్నారు. 3 వేలకు పైగా పోలీసులు కేసులు పెట్టారన్నారు. రాజధాని ఉద్యమంలో మహిళలు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. పొలాలు త్యాగాలు చేసిన రైతులకు కౌల్లు ఇచ్చే పరిస్థితి ఈ ప్రభుత్వానికి లేదన్నారు. చంద్రబాబునాయుడు 2019లో ఎంతో అనుభవంతో వైసీపీకి ఓటు వేస్తే రాజధాని లేకుండా చేస్తారని ముందే చెప్పారన్నారు. చంద్రబాబు చెప్పినట్లే రాజధానిని జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేయటానికి పూనుకున్నారన్నారు. తాడికొండలో నీటి సమస్య ఉన్నదని, రాజధానికి వెళ్లే ప్రధాన రహదారి కావటంతో తాడికొండలో రోడ్లు వెడల్పు చేసే క్రమంలో ఇళ్లు, వ్యాపార దుకాణాలు కోల్పోన వారికి పరిహారం ఇవ్వాలని, అక్కదేవత చెరువుపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, కొండ మల్లికార్జున శివాలయంకు ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చంద్రబాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### తాడికొండకు శాశ్వత తాగునీటి పరిష్కారం

నియోజకవర్గంలోని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో రోడ్డు వెడల్పులో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి పరిహారం అందిస్తామన్నారు. ఎస్సీల శ్మశానం కోసం ఎకరం పొలం ఇస్తామన్నారు. కొండ మల్లికార్జున శివాలయం ఘాట్ రోడ్డు వేయటానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఫిరంగిపురంలోని కొండపై ఉన్న చర్చి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించి.. తాడికొండ అభివృద్ధికి పాటుపడతామన్నారు.

### ప్రజాగళం సభకు తరలిన మహిళలు, టీడీపీ శ్రేణులు

తాడికొండలో నిర్వహించిన ప్రజాగళం సభకు పెద్దసంఖ్యలో మహిళలు, టీడీపీ కార్యకర్తలు, అమరావతి మహిళలు, రైతులు హాజరయ్యారు. ఎండను సైతం లెక్కచేయకుండా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. చంద్రబాబు కోసం ఎదురుచూశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సభలో ఎమ్మార్పీఎస్ సభ్యులు జెండాలు పట్టుకొని మద్దతు తెలిపారు. రెండు రోడ్డుల కూడలిలో సభపెట్టడంతో జనం కిక్కిరిసి పోయారు. వైసీపీ నుంచి తాడికొండ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా పనిచేసిన కొల్లికొండ క్రాంతి, వైసీపీ గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి కొల్లికొండ వెంకట్‌లు చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. చంద్రబాబును కలిసిన వారిలో బాష్యం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి, మండల పార్టీ అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్‌కుమార్, యడ్లపల్లి సాంబశివరావు, గడ్డిపాటి సాంబశివరావు, గుంటుపల్లి మధుసూదనరావు, నీలాల కృష్ణారావు, చిగురపాటి అనూఫ్, మానుకొండ శివరామకృష్ణ, రావిపాటి సాయికృష్ణ, వడ్లమూడి పూర్ణచంద్రరావు, పువ్వాడ సుధాకర్, ధనేకుల సుబ్బారావు, దామినేని శ్రీనివాసరావు, పుట్టి రామచంద్రరావు, పులి చిన్నా, జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ్ శేఖర్, నరేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంతేటి బ్రహ్మయ్య, పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చలేక పోయిన సీఎం : రామాంజనేయులు

ప్రత్తిపాడులో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయారని టీడీపీ అభ్యర్థి బీ రామాంజనేయులు జగన్‌ను ఎద్దేవా చేశారు. గుంటూరు ఛానల్ పొడిగింపుతో పాటు, నల్లమడ వాగు ఆధునికీకరణ, ప్రత్తిపాడు ప్రధాన రహదారి విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబును కోరారు.

### జగన్‌కు ఓటు వేసేవారు ఉన్నారా : మాకినేని పెదరత్తయ్య

దుర్మార్గపు పాలన చేస్తున్న జగన్‌కు ఓటు వేసే వారు ఇంకా ఉన్నారా అని మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య అన్నారు. నాడు అన్న ఎన్‌టీఆర్ ఈ ప్రాంతంలో వేసిన అడుగులను ఆయన గుర్తు చేశారు. చంద్రబాబు ద్వారానే రాష్ట్రం బాగు పడుతుందన్నారు.

### జగన్‌రెడ్డి రాజకీయ జీవితం ముగిసినట్లే : కొర్రపాటి

జగన్ రెడ్డి ఇక నీ రాజకీయ జీవితం ముగిసింది అని ప్రత్తిపాడు జనసేన పార్టీ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. పేదలకు అన్యాయం చేసిన నీకు ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. మీ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పారి పోతున్నారంటూ ఎద్దేవా చేశారు.



ప్రజాగళం సభలో ఎమ్మార్పీఎస్ సభ్యులు

# ప్రజలను మోసగించిన వైసీపీని తరిమికొడదాం

● నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నారా లోకేశ్



కొత్తపేటలో నిర్వహించిన రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 13: ముఖ్యమంత్రిగా జగన్‌కానీ, ఎమ్మెల్యేగా ఆళ్ల రామకృష్ణారెడ్డికానీ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసగించారని టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విమర్శించారు. తాను వారిద్దరిలా మాట తప్పి మడమ తిప్పే మనిషిని కానని ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసి తానేంటో రుజువు చేసుకుంటానని వ్యాఖ్యానించారు. నగరంలోని కొత్తపేట రామాలయం సెంటర్, ఇస్లాంపేట, ఆత్మకూరు వడ్డెరపాలెం ఏరియాల్లో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. పనిచేసే మనసుండాలే కానీ ఏఅభివృద్ధినైనా సాధించవచ్చునన్నారు. ఆళ్ల మాదిరి నటించాల్సిన అవసరం లేదన్నారు. మంగళగిరి అభివృద్ధికి రూ.1200 కోట్ల నిధులను ఇస్తానని చెప్పి ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారని సాక్షాత్తూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డే విమర్శించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చేసిన మోసానికిగాను ప్రజలకు మొఖం చూపించలేక రాజీనామా చేస్తున్నానని చెప్పి వెళ్లిపోయిన ఆళ్ల మళ్లీ వచ్చి చెల్లెమ్మను వెంటబెట్టుకుని ఓట్లడుగుతున్నారంటూ ఎద్దేవా చేశారు. అసలు ఏమొఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయిన రాజధాని అమరావతి పనులను పరుగులు తీయిస్తామని లోకేశ్ చెప్పారు. సింహాచలం తరహాలో అటవీభూములను డీనోటిఫై చేసి ఆయా భూముల్లో నివశిస్తున్న పేదలకు శాశ్వత ప్రాతిపదికన నివేశనపట్టాలను ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం, సంరక్షణ తమ తెలుగుదేశం బాధ్యతన్నారు. వారిని తమ గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామన్నారు. వైసీపీ అయిదేళ్లపాలనలో నియోజకవర్గంలో ఒక్కరికి ఇంటిపట్టా కానీ, ఒక్కరికైనా ఉద్యోగం కానీ ఇప్పించిన పాపాన పోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మంగళగిరికి వివిధ రకాల పరిశ్రమలను, సంస్థలను తీసుకొచ్చి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. మంగళగిరిలో ముస్లింల డిమాండ్ మేరకు కిస్మత్ తరహాలో ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటుచేస్తామన్నారు. యువత పోటీ పరీక్షలలో సత్తా చాటేందుకు అవసరమైన కోచింగ్ సెంటర్లను నెలకొల్పుతామన్నారు. పన్నులభారంతో సతమతమవుతున్న ప్రజల కోరిక మేరకు నగరపాలకసంస్థను తిరిగి రెండు వేర్వేరు పురపాలకసంఘాలుగా ఏర్పాటుచేసి పన్నుల భారాన్ని తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. మెగా డీఎస్సీతో పాటు పెండింగ్ పోస్టులను భర్తీ చేస్తామని హామీలనిచ్చారు. తనకు గెలుపు ముఖ్యం కాదని, తన దృష్టంతా మెజారిటీపైనే ఉందన్నారు.

### 2014, 2019లో బీసీలకు టిక్కెట్లను ఎందుకివ్వలేదు : చిల్లపల్లి

ప్రస్తుత సందర్భంలో వైసీపీ... బీసీలకు తామే టిక్కెట్‌ను ఇచ్చామని తెగ గొప్పలు చెప్పుకుంటుందని...ఇదే బీసీ మంత్రాన్ని వైసీపి పెద్దలు 2014, 2019 ఎన్నికలప్పుడు ఎందుకు విస్మరించారో ప్రజలకు వివరించాలని జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిల్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జగన్ కారణంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం ఒక్క చంద్రబాబుకు మాత్రమే సాధ్యమని చెప్పారు. విజ్ఞులైన ప్రజలు రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ప్రజా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, తమ్మిశెట్టి .జానకీదేవి, తోట పార్థసారధి, గోవాడ దుర్గారావు, సుఖమంచి వెంకట గిరి, పడవల మహేష్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ రియాజ్, షేక్ జిలానీ, గోసాల రాఘవ, మాజేటి సూర్యవేణు గోపాలకృష్ణ, మున్నంగి శివశేషగిరిరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీరావు, షేక్ సుభానీ, జంజనం వెంకట సాంబశివరావు, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13: మంగళగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తుంది. టీడీపీలో చేరేందుకు వివిధ వర్గాల ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన మేడా ఇమ్మానుయేల్, కుంభా శివనాగేశ్వరరావు, తోకల శ్రీనివాస్ సమక్షంలో 20మంది శనివారం తెలుగుదేశంలో చేరారు. ఉండవల్లిలోని నివాసంలో వీరందరికీ యువనేత నారా లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## టీడీపీలో చేరిన 30 వైసీపీ కుటుంబాలు

● వైసీపీ గ్రామ సర్పంచ్‌తో పాటు మరో 100 మంది



టీడీపీలో చేరేందుకు ప్రత్తిపాడు ప్రజాగళం సభకు తరలివెళ్తున్న రాజుపాలెం వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పెదనందిపాడు, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని రాజుపా లెం గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. వైసీపీ గ్రామ సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావుతో పాటు మరో 100 మందితో ప్రత్తిపాడులో జరుగుతున్న ప్రజాగళం బహిరంగ సభకు తరలివెళ్లారు. ప్రజాగళం సభలో టీడీపీలో చేరారు.

### వైసీపీ ప్రజాప్రతినిధుల చేరిక

మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ ఆధ్వర్యంలో రావిపాడు, రాజుపాలెం, అబ్బినేనిగుంట పాలెం గ్రామాలకు చెందిన వైసీపీ సర్పంచులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, వార్డు సభ్యులతో పాటు పలువురు సీనియర్ నేతలు ప్రత్తిపాడులో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కమ్మ నాగమల్లేశ్వరరావు, రావిపాటి కృష్ణప్రసాద్, మదమంచి వాసు, కుర్రా శివనాగేశ్వరావు, అరవపల్లి రాంబాబు, కొమ్మినేని స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మేడికొండూరు: ఏప్రిల్ 13: వ్యవసాయం కలసి రాలేదు, అప్పులు తీరే మార్గం లేక కౌలు రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మేడికొండూరు మండలంలోని మందపాడు గ్రామములో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఇదే గ్రామానికి చెందిన కటారి మరియదాసు (42) పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగు చేస్తూ జీవిస్తుంటాడు. గడిచిన మూడు సంవత్సరాలుగా తాను సాగు చేస్తున్న మిర్చి పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పాటు పెట్టుబడి పెరిగి ఆదాయం తగ్గడంతో అప్పుల పాలయ్యాడు. తన జీవనోపాధి వ్యవసాయమే కావడంతో ఈ సంవత్సరం అయినా లాభాలు వస్తాయని ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేశాడు. ఒక్కో ఎకరానికి ముందస్తు కౌలు 60 వేల చొప్పున 5 ఎకరాలకు గాను కొంత మొత్తం ముందు కౌలు చెల్లించాడు. వ్యవసాయ సాగు ప్రారంభంలో ఆశాజనకంగా వస్తున్నప్పటికీ, అనావృష్టి కారణంగా సరైన దిగుబడి రాక ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఒక వైపు పంట సాగుకు తెచ్చిన అప్పులు, మరో పక్క పురుగుల మందు షాపులో అప్పులు కలసి రూ.5 లక్షలు అప్పులు మిగిలాయి. రుణ దాతల వత్తిళ్లు, అవి తీరే మార్గం కనిపించకపోవడంతో గ్రామానికి సమీపంలో తన మిర్చి కళ్ళంలోనే శుక్రవారం రాత్రి పురుగులు మందు తాగి విగతాజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108 సాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. జరిగిన సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రత్తిపాడులో జరిగిన ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

## పెమ్మసాని, రామాంజనేయులు
# ఇద్దరూ సమర్థులే..

● భారీ మెజార్టీలతో గెలిపించాలి

● ప్రత్తిపాడు ప్రజాగళం సభలో చంద్రబాబు పిలుపు

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేరు చెబితేనే ప్రజల్లో ఒక ఉత్సాహం ఉరకలేస్తున్నదని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం సాయంత్రం ప్రత్తిపాడులో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పేద ఇంట్లో పుట్టి బాగా చదువుకొని అమెరికా వెళ్లిన పెమ్మసాని ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. పెమ్మసాని అమరావతి రాజధాని కలిగిన గుంటూరు లోక్‌సభ స్థానానికి కాబోయే ఎంపీ అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన తెలివితేటలతో అమరావతి రాజధాని అభివృద్ధి చెందుతుందని, అలానే నియోజకవర్గ ప్రజలకు ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. పెమ్మసానిని నిండు మనస్సుతో ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంకోవైపు బూర్ల రామాంజనేయులు. ఈ జిల్లాలోనే కలెక్టర్‌గా పని చేశారు. దాదాపుగా 14 ఏళ్లు ఐఏఎస్ అధికారి హోదాలో నా వద్ద నిజాయితీగా విధులు నిర్వహించారు. మంచి పట్టుదల కలిగిన వ్యక్తి అని చెప్పారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలు ఆయన నేతృత్వంలో తప్పక పరిష్కరిస్తానని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ, ప్రత్తిపాడులో సెంట్రల్ డివైడర్ వంటి అన్ని పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. జగన్ రాజకీయాల్లో ఒక కొత్త సంస్కృతిని తీసుకొచ్చాడని, ఒకసారి గెలిచిన అభ్యర్థి ఐదేళ్లలో ఆ నియోజకవర్గంలో మొత్తం ఊడ్చేస్తారని, ఆ తర్వాత వేరే చోట సంపాదించుకోవడానికి నియోజకవర్గం మారుస్తున్నాడని చెప్పారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి సమర్థవంతులైన పెమ్మసానిని గుంటూరు ఎంపీగా, రామాంజనేయులుని ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు.



ప్రజాగళంలో చంద్రబాబుతో కూటమి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు



దాబాపైనుంచి చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు



ట్రాక్టర్‌పై నిల్చుని విజయసంకేతం చూపుతున్న మహిళలు



ప్రజాగళం సభకు హాజరైన మహిళలు



ప్రజాగళం సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

## రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి

● తెనాలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13: ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి ఏర్పడిందని తెనాలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం పట్టణంలోని గౌతంగ్రాంగ్ హోటల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు పార్లమెంటరీ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేకర్ సోదరుడు రవిశంకర్, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, రాఘవేంద్ర, ఎడ్లపాటి రఘునాథ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, కత్తెర సురేష్‌కుమార్ దంపతులు, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, పాటిబండ్ల రామకృష్ణ పలువురు ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్నామన్నారు. గత ఐదేళ్లుగా టీడీపీ,జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు, హత్యలతో వైసీపీ దుర్మార్గపు పాలనకు తెరలేపిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుపై చేయని తప్పుకు అక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచిన తీరును ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగకపోగా ప్రకృతి సంపదగా ఉన్న భూమి, మట్టి, ఇసుక వంటివి అందినకాడికి దోచుకుంటున్న తీరు వైసీపీ పాలనలోనే చూశామని విమర్శించారు. ప్రజలందరికీ మంచి జరగాలన్నదే ఉమ్మడి పార్టీల ముఖ్యఉద్దేమని, తెనాలి ప్రాంతంలో టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు, దాడులను తాను మర్చిపోలేనన్నారు. తనకు టీడీపీ, జనసేన కార్యకర్తలు వేరు వేరు కాదన్నారు. అందరూ సమానమేనని చెప్పారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేలా ముందుకు నడవాలన్నారు.

ఎంపీ అభ్యర్థి సోదరుడు పెమ్మసాని రవి మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎంతో కీలకంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కోరారు. కూటమి అభ్యర్థులు కలిసికట్టుగా ఉంటే వారి గెలుపు చరిత్రలో మిగిలిపోతుందన్నారు. యడ్లపాటి రఘునాథ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం, ఆయుష్మాన్ భారత్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలను సైతం జగన్‌మోహన్ రెడ్డి అంతాతానే చేపిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. దేశం అభివృద్ధిలో నడవాలన్నది బీజేపీ నరేంద్రమోడీ సిద్ధాంతమని, రాష్ట్రంలో కూడా ఉమ్మడి పార్టీల గెలుపుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు పెట్టనుందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా రాజకీయ అవసరాల కోసం తమను ఆర్థికంగా, మానసికంగా మనోవేధనకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 సంవత్సరాలు వైసీపీ పార్టీ కోసం ఎంతో శ్రమించామని పార్టీలో తమకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారన్నారు. తాడికొండ వైసీపీ ఇన్‌చార్జ్‌గా తన భర్త కత్తెర సురేష్‌కుమార్‌ను నియమించగా సంవత్సరన్నర పాటు అహర్నిశలు పార్టీ కోసం కృషి చేస్తే ఆ సీటు వేరువారికి కేటాయించి తమకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. వైసీపీ పార్టీలో పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి, దళితులకు తగిన గౌరవం లేదన్నది నిజమన్నారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు తమ ప్రసంగంలో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని ఉమ్మడి పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో అన్నాబత్తుని జయలక్ష్మి, డాక్టర్ మనోహరం, నన్నపనేని సుధాకర్, ఎల్.రామారావు, వంగాసాంబిరెడ్డి, సుద్ధపల్లి నాగరాజు, పినపాటి సురేష్‌బాబు, హరిదాసు గౌరి శంకర్ పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ప్రదర్శన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 : బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని సూర్య శిల్పశాలలో విగ్రహాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. 2 నుంచి 29 అడుగుల ఎత్తు వరకు రూపొందించిన పలు విగ్రహాలను ప్రదర్శనలో ఉంచారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ప్రతిష్ఠించేందుకు తయారు చేసిన కాంస్య విగ్రహం కూడా ప్రదర్శనలో ఉంచారు. కుర్చీలో కూర్చుని రాజ్యాంగాన్ని రాస్తున్న అంబేద్కర్ విగ్రహాన్ని తయారు చేయడం తమకు మంచి పేరు తెచ్చిందని శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు చెప్పారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు రావడంతో విగ్రహాలను తయారు చేసి పంపామన్నారు. శిల్పులు రవిచంద్ర, శ్రీహర్ష పాల్గొన్నారు.



తయారు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలతో శిల్పి కాటూరి వెంకటేశ్వర రావు, తదితరులు

# ముస్లింల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

● పొన్నూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ

● ఎన్నికల ప్రచారంలో భాగంగా విస్తృత పర్యటన



పొన్నూరులో మహిళతో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఏప్రిల్13: ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపటమే తమ లక్ష్యం అని పొన్నూరు నియోజకవ్గ కూటమి అభ్యర్థి, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని 26వ వార్డు ఇటికంపాడు రోడ్డులో శనివారం నరేంద్ర కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని జెండా చెట్టు వద్ద మసీద్‌లో ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. అనంతరం ఇంటింటికి వెళ్లి టీడీపీ మిని మేనిఫెస్టో కరపత్రాలను పంచి పెట్టారు. పలువురు మహిళలు నరేంద్ర కుమార్‌ను కలిసి తమ సమస్యలు తెలియజేసారు. అనంతరం అయన మాట్లాడుతూ ధూళిపాళ్ళ కుటుంబానికి ముస్లింతో ఎంతో అనుబంధం ఉందన్నారు. పట్టణంలో ప్రతి మైనార్టీ కుటుంబం తన తండ్రీ వీరయ్యచౌదరి హయం నుంచి తమ స్వంత కుటుంబంగా మెలుగుతూ వచ్చిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రధాన్యం ఇచ్చి, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ముఖ్యంగా పేద ముస్లిం యువతుల వివాహాలకు దుల్హన్ పథకాన్ని అమలుచేసి షరతులు లేకుండా రూ. 50 వేలను వివాహ ఖర్చులకు అందజేసినట్లు గుర్తుచేశారు. అలాగే మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించి యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ మైనార్టీలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ఇటికంపాడు రోడ్డులో అత్యధికులు ముస్లీం మైనార్టీలు నివసిస్తున్నందున వారి కోసం 2019కు ముందు రూ.2 కోట్ల వ్యయంతో షాదీ ఖానా నిర్మాణం చేపడితే నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా ఐదేళ్లుగా భవన నిర్మాణ పనులు నిలిపివేసిన ఘనత వైసిపి పాలకులదని ధ్వజమెత్తారు. ప్రజలు కూడా విజ్ఞతతో ఆలోచించి టీడీపీ, జనసేన కూటమికి రానున్న ఎన్నికలో అండగా నిలవాలన్ని నరేంద్ర కుమార్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**మీ కుటుంబ సభ్యుడిగా అన్ని విషయాల్లో అండగా ఉంటా.**

పెదకాకాని : వెనిగండ్ల గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కారం చేస్తామనిధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో పర్యటించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్-6 పథకాలను వివరించే కరపత్రాలు పంచుతూ మహిళలకు, యువతకు, ప్రజలకు తెలియజేస్తూ, వార్డులోని ప్రజల సమస్యలను అడిగీ తెలుసుకున్నారు. నరేంద్రకుమార్ వెంట పొన్నూరు జనసేనపార్టీ సమన్వయకర్త మార్కండేయులుబాబు, నేతలు పలువురు ఉన్నారు. వెనిగండ్లలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది, అన్ని గ్రామాల్లో అడుగడుగునా ప్రజలు నరేంద్రకు బ్రహ్మరథం పట్టారు.

**గొల్లమూడి గ్రామంలో జన నీరాజనాలు..**

మండల పరిధిలోని గొల్లమూడి గ్రామంలో ధూళిపాల నరేంద్ర కుమార్‌కు, వద్రాణం మార్కండేయబాబుకు గ్రామస్థులు నీరాజనం పలికారు. గ్రామంలో అంతర్గత రహదారులు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని నరేంద్రకుమార్ హామీ ఇచ్చారు. గ్రామానికి కావల సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. అనం తరం గ్రామంలో జనసేన పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు వీరేళ్ల వెంకటేశ్వరరావు, గొల్లమూడి జనసేన అధ్యక్షులు పోలా వాసు, మాజీ సర్పంచ్ పసుపులేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**పెదకాకానిలో పర్యటించిన నరేంద్ర..**

మండల కేంద్రమైన పెదకాకానిలోని పాత ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డు, సదాశివకాలనీ ప్రాంతాల్లో ధూళిపాళ్ల నరేంద్రకుమార్, వద్రాణం మార్కండేయబాబులు పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని, పెదకాకానిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దు తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



వెనిగండ్లలో వృద్ధులకు నమస్కరిస్తున్న నరేంద్ర కుమార్



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు

## కూటమి విజయం కోరుతూ ప్రచారం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 13: రానున్న ఎన్నికలలో కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించండని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని 33, 34వ వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గ్లాసు గుర్తుపై, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటిచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈమేరకు బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు గాలి సుజన్, చల్ల శివకుమార్, షేక్ సుభాని, చెట్టు వెంకటేశ్వరమ్మ, మహేష్, పవన్, శ్రీను, కృష్ణయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు దళిత ఉద్యమ సారథి

## ఏసురత్నం పుస్తక పరిచయ సభ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 : దళిత ఉద్యమ రథసారధి కనపర్తి ఏసురత్నం జీవితంపై రూపొందించిన పుస్తక పరిచయం సభ ఆదివారం జరుగుతుందని అంబేద్కర్ సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈమేరకు శనివారం కార్యక్రమ పత్రాలను ఆవిష్కరించారు. ఐతానగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించే సభలో దళిత నేతలు పిల్లి విద్యాసాగర్, సమత, డాక్టర్ స్వర్ణలత, జీఎస్ నాగేశ్వరరావు, అబ్రహం లింకన్ తదితరులు ప్రసంగిస్తారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ట్రస్టు సభ్యులు కోరారు.

## ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర, ఏప్రిల్ 13 : వేసవి తీవ్రతపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి ఆరోగ్య కేంద్రంలో ఈ వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ వడ దెబ్బ తగల కుండా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి బుధ, శనివారాలు వేసే టీకాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న పరిస్థితుల్లో గర్భిణులు ఇంట్లోనే ఉండటం మంచిదన్నారు. వేసవిలో మసాల కలిగిన ఆహార పధార్థాలను ముట్టుకోవడం మంచిదికాదన్నారు. వడదెబ్బ తగినట్లు అనిపిస్తే వెంటనే వారికి తగిన సమయంలో వైద్యం అందించాలన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం మంచిదన్నారు. సమావేశంలో వైద్యాధికారి వేముల ప్రియాంక, ఆరోగ్యవిస్తరణాధికారి టి. నాగరాజు, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న నాదెండ్ల మనోహరం తదితరులు

## కూటమి అభ్యర్థులను గెలిపించండి

● ఎన్నికల ప్రచారంలో డాక్టర్ నాదెండ్ల మనోహరం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 13: రాష్ట్రాభివృద్ధికి రానున్న ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించండని జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ నాదెండ్ల మనోహరం ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 39, 40వ వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి పార్టీ అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటిచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మన పట్టణ అభివృద్ధికి వారిద్దరూ కృషి చేస్తారని, ప్రజలందరూ ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.





పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయం

## ప్రజలపై ఆస్థి పన్ను బాదుడు

● ఐదేళ్లలో నాలుగు సార్లు ఆస్థి పన్ను పెంపు

● ఐదేళ్లలో ప్రజలపై 1.67 కోట్ల అధనపు భారం

● ఏడాదిలో రూ. 62 లక్షల పెంపు

పొన్నూరు టౌన్, ఏప్రిల్13: పొన్నూరు పురపాలక సంఘంలో ఆస్థి పన్ను బాదుడుతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత ఐదేళ్లలో పురప్రజలపై నాలుగు సార్లు పన్నుల భారం పెంచి రూ. 1.67 కోట్లు వైసీపీ ప్రభుత్వం అదనపు పన్ను విధించింది. పెంచిన పన్నులు చెల్లించాలని పురప్రజలకు పురపాలక సంఘం అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామన్న అధికారుల బెదిరింపులు ప్రజలకు తీవ్ర అవస్థలను తెచ్చిపెడుతుంది. రాష్ట్రంలో గతంలో వార్షిక అద్దె విలువ ఆధారంగా పన్నుల పెంపు ఉండేది. అది కూడా 2019కు ముందు ఐదేళ్లకు ఒక సారి మాత్రమే పన్ను పెంచేవారు. 2019 నుంచి వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఏడాదికి 15 శాతం చొప్పున నాలుగు సార్లు, ఆస్థి పన్నును పెంచుకుంటూ పోయారు. అది కూడా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రతి 6 నెలలకు ఒక సారి భూముల విలువ పెంచుతారు. ఆ పెంపు ఆధారంగా క్యాపిటల్ వ్యాల్యూ అంటే ఆస్థి మూల ధన విలువ ఆధారంగా పన్ను పెంచే విధానాన్ని వైసిపి ప్రభుత్వం చేపట్టింది. దీంతో మూల ధన విలువ పెరిగిన ప్రతిసారి పుర ప్రజలపై అధిక పన్నుల భారం పడుతూనే ఉంది. నూతన విధానంలో ప్రజలపై అదనపు బారాలు పడి పన్నులు చెల్లించలేని తీవ్ర అవస్థలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతంగా గుర్తింపు పొందిన పొన్నూరు పురపాలక సంఘంలో అధిక భాగం ప్రజలు సామాన్య, మధ్య తరగతి వారే. వీరిపై ఏటా పన్నుల పెంపు తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఈ పెను భారం గుదిబండగా మారిందని పన్ను చెల్లింపుదారులు, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికి వైసీపీ ప్రభుత్వం మాత్రం ఈ విధానానే కొనసాగించుకుంటూ పోతుంది.

**ఐదేళ్లలో పొన్నూరు ప్రజలపై రూ. 1.67 కోట్ల అధనపు బాధుడు....**

బాధుడే బాధుడు అంటూ గత ప్రభుత్వ విధానాలపై విస్తృత ప్రచారం చేసిన వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలపై అధనపు పన్నుల భారం విధిస్తూ ప్రజలను తీవ్రమైన ఆర్థిక కష్టాలోకి నెట్టివేసింది. పొన్నూరు పట్టణంలో 31 వార్డులు ఉండగా 61,500 జనాభా ఉన్నారు. పట్టణంలో 14,476 గృహాలు ఉన్నాయి. 2019-20 సంవత్సరంలో ప్రాపర్టీ ట్యాక్స్ ఖాళీ స్థలాల పన్ను డిమాండ్ రూ. 3.17 కోట్లు ఉండేది. అతర్వాత వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆస్థి మూలధన విలువ ఆధారంగా పన్నులు పెంచటంతో ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్థి పన్ను డిమాండ్ రూ. 4.84 కోట్లకు చేరింది. గతేడాది అంటే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 4.22 కోట్ల ఆస్థి పన్ను డిమాండ్ ఉంది. కేవలం ఏడాదిలో రూ. 66 లక్షల అధిక పన్నుల భారం పురప్రజలపై పడింది. పెంచిన ఆస్థి పన్ను చెల్లించాలని ఇప్పటికే అధికారులు ప్రజలపై ఒత్తిడి పెంచటంతో తట్టుకోలేక అప్పులుచేసి మరీ పెంచిన ఆస్థి పన్నులు చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షల వరకు పన్ను వసూళ్ల అయినట్లు పురపాక సంఘం రెవెన్యూ అధికారి తోట వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే పన్నులు చెల్లించడానికి ప్రజలు ఆస్తులు అమ్ముకోవలసి వస్తుందని చెల్లింపు దారులు వాపోతున్నారు.



ఈవోగా బాధ్యతలు చేపట్టిన ప్రసాదను ఆశీర్వదిస్తున్న ఆలయ వేద పండితులు

పెదకకాని శివాలయం

## ఈవోగా ప్రసాదు బాధ్యతల స్వీకారం

పెదకాకాని, ఏప్రిల్ 13 : పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా ప్రసాదు శనివారం బాధ్యత చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన శ్రీరామ్ వరప్రసాద హెడ్ ఆఫీస్ కి బదిలీ చేశారు. హెడ్ ఆఫీస్‌లో విజిలెన్స్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ గా ఉన్న ప్రసాద ను పెదకాకాని దేవస్థానానికి బదిలీ చేశారు. అందులో భాగంగా అయన ఆలయ ఈవో గా బాధ్యతలు చేపట్టి వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు.

## శ్యామ్‌సాగర్‌కు అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13: జర్నలిజంలో సేవలు అందిస్తున్న అంబటి శ్యామ్‌సాగర్ అభినందనీయుడని ప్రొఫెసర్ కనపర్తి అబ్రహం లింకన్ తెలిపారు. ఆర్టీసి బస్టాండ్ వద్ద అంబేద్కర్ రీడింగ్ కమ్యూనిటీ హాలులో ఆయనను శనివారం జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. జర్నలిజం వృత్తి సాహసంతో కూడుకున్నదని, ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరారని చెప్పారు. కనపర్తి రత్నాకర్, అశోక్‌కుమార్, గురుబ్రహ్మం, డేవిడ్, ప్రకాశరావు, శామ్యూల్‌లు పాల్గొన్నారు.

## ఈదర వంశీయుల ఆత్మీయ సమావేశం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 : పట్టణంలోని ఐతానగర్‌లో శనివారం ఈదర వంశీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒంగోలు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు హాజరయ్యారు. రచయిత ప్రభాకర్ రాసిన ఈదర వంశ వృక్షం పుస్తకాన్ని బహుకరించారు. రాష్ట్రంలో ఉన్న ఈదర వంశీయుల వివరాలను ఈదర పూర్ణచంద్ వివరించారు. వంశ వృద్ధికి చేయాల్సినకృషిని తెలిపారు. ప్రభాకర్, హరిబాబులను సన్మానించారు. శ్యామ్, అంకినీడు, బుచ్చియ్య, పిచ్చయ్య, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాతలు నష్టపోకుండా మాక్ మూవీ మేక్

● సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 : సినిమా చిత్రీకరణలో నిర్మాతలు నష్టపోకుండా ఉండేందుకు మాక్ మూవీ మేక్ అనే కార్యక్రమాన్ని రూపొందించామని దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, సినిమా రూపొందించిన విధానం, పాటలు, ఫైట్స్ చిత్రీకరణ, ఎడిటింగ్, డబ్బింగ్, సాంకేతిక పనులు ఎలా పూర్తి చేయాలో ఈ కార్యక్రమం వివరిస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుండి సినీ నిర్మాణంపై ఆసక్తి ఉండే ఔత్సాహికులకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సినిమా నిర్మాణం పేరుతో ఎవరూ మోసపోకుండా ఉండేందుకు మా ఏపీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో నటుడు ప్రసాద్ పాల్గొన్నారు.





విలేకర్లతో మాట్లాడుతున్న దిలీప్‌రాజా

## ఇంటర్ పరీక్షల్లో ఎన్నారై విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్,ఏప్రిల్ 13: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఎన్నారై జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 465 మార్కులు ఐదుగురు విద్యార్థులు సాధించారు. 10 మందికి 464 మార్కులు, 12 మందికి 463 మార్కులు, 18 మందికి 462 మార్కులు, 22 మందికి 461 మార్కులు, 27 మందికి 460 మార్కులు లభించాయని డీన్ ఉమామహేశ్వరరావు తెలిపారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను 7 విద్యార్థులు 434 మార్కులు, 12 మంది విద్యార్థులు 420 మార్కులు సాధించారు. జూనియర్ ఎంఈసీలో 500 మార్కులకు 463 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో తమ విద్యార్థులు 989, 988, 987, 986 మార్కులు సాధించి ముందంజలో ఉన్నారన్నారు. సీనియర్ బైపీసీలో 973, 971, 970 మార్కులు సాధించారు. సీనియర్ ఎంఈసీలోనూ సత్తా చాటారన్నారు. ప్రిన్సిపాల్ శివన్నారాయణ, కృష్ణారెడ్డి, మల్లేశ్వరి, సురేష్‌లు విద్యార్థులను అభినందించారు.





ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎన్నారై డీన్ ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు

నేడు ఆర్య, వైశ్య

## ఆత్మీయ సమ్మేళనం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13: స్థానిక రింగురోడ్డు, సిద్ధార్ధ గార్డెన్స్‌లో ఆది వారం ఆర్య, వైశ్య ఆత్మీయ సమ్మేళనం-ఎన్డీఏ కూటమి జిల్లా అభ్యర్థు పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర తెలిపారు. శనివారం, లక్ష్మీపురంలో కోవెలమూడి రవీంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడు తూ సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్డీఏ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు హాజరవు తున్నట్లు వివరించా రు. టీడీపీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాదు మాట్లాడుతూ అభ్యర్థు ల పరిచయంతో పాటు, ఆర్య, వైశ్య సమ స్యలను అభ్యర్థుల దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు కొత్తూరు వెంకట్, వాలివేటి కృష్ణ, ఏల్చూరి వెంకటేశ్వర్లు, ఆల్లం శేకర్, కొట శేషగిరి, అల్లం సత్య నారాయణ, అన్నవర పు చక్రి. సురేష్, కాశీ, వెచ్చా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.